కాలనీ ఖాళీ..!

- కొమరోలు జగనన్న కాలనీలో 3 నెలలుగా నీటి సమస్య
- వర్షం పడితే రాకపోకలకు తీవ్ర అవస్థలు
- కనీస సౌకర్యాలు లేక ఇళ్లు వదిలి వెళ్తున్న లబ్ధిదారులు
- సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోని అధికారులు

కొమరోలు:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివేశన స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో పక్కా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకుని ఆనందంగా గడపసాగారు. అయితే ఏడాది క్రితం గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆయా కాలనీల్లో సమస్యలను గాలికి వదిలివేయడంతో లబ్ధిదారులు తమ గృహాలను ఖాళీ చేసి వసతులున్న చోట అద్దె ఇళ్లు వెతుక్కుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొమరోలు పట్టణ సమీపంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వెనుక వైపున 2020వ సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన దాదాపు 160 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. వారిలో దాదాపు 80 మంది వరకు గృహాలు నిర్మించుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. స్వల్ప సంఖ్యలో లబ్ధిదారులు ఆర్థిక సమస్యల కారణంగా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు.

ఆనందం ఆవిరి

గృహాలు నిర్మించుకున్న పదుల సంఖ్యలో లబ్ధిదారులు గతంలో సామూహికంగా గృహ ప్రవేశాలు చేశారు. వారు నిర్మించుకున్న గృహాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉండసాగారు. గత ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీల్లో వసతులు కల్పించే విషయాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఒక్కొక్కరుగా ఖాళీగా చేస్తూ వస్తున్నారు.

వర్షం పడితే రోడ్లు చిత్తడి

చిన్నపాటి వర్షం పడిందంటే జగనన్న కాలనీలోని



గుంతలమయంగా జగనన్న కాలనీకి వెళ్లే రహదారి

రహదారులు నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. మట్టి రోడ్లలో ద్విచక్ర వాహనాలు కూరుకుపోతుండటంతో నరకయాతన అనుభవిస్తున్నారు.

చిల్లచెట్లతో పరిసరాలు అధ్వానం

జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించకపోగా గృహాల మధ్య భారీగా చిల్లచెట్లు తొలగించకపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో రాత్రివేళల్లో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలనీలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరిస్తే నివాసం ఉండటానికి ఆస్కారం ఉంటుందని, తమ ఇళ్లలోకి తిరిగి చేరుతామని స్థానికులు చెబుతున్నారు.

3 నెలలుగా నీటి సమస్య

జగనన్న కాలనీ ఏర్పాటు సమయంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో మంచినీటి బోరును వేయించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఇబ్బంది లేకుండా చేశారు. ఇటీవల మరమ్మతులకు గురైన డీప్‌బోరును బాగుచేయించకపోవడంతో కాలనీవాసులకు కష్టాలు మొదలయ్యాయి. నీటి సమస్య తీర్చాలని స్థానిక పంచాయతీ కార్యాలయంలో విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



మరమ్మతులకు గురైన డీప్ బోరు



ఓ లబ్ధిదారుడు ఖాళీ చేసిన ఇల్లు





కాలనీలో నివాసాల చుట్టూ చిల్లచెట్లు

క్లుప్తంగా

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు

- పంచాయతీ సిబ్బందిపై డీఎల్‌పీఓ ఆగ్రహం

అర్ధవీడు: మండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను మార్కాపురం డీఎల్‌పీఓ ఎంవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. కాకర్లలో చెత్త నుంచి సంపద కేంద్రం అధ్వానంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లోగా కేంద్రాన్ని బాగు చేసి ఫొటోలు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పాపినేనిపల్లిలో కేంద్రాన్ని సందర్శించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎరువు దిబ్బలను తొలగించాలని ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి: పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా పి.సి.నారాయణరెడ్డి, కార్యదర్శిగా సీడీపీఓ సుధామారుతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సన్‌షైన్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎస్పీ బాలయ్య, కోశాధికారిగా వై.బాల వెంకటరెడ్డి, బీసీలుగా డి.వంశీకృష్ణ, యు.నరసారెడ్డి, బి.శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా ఎ.దివాకర్, టీవీ నాగరాజకుమారి, కె.శారా, జి.పుణ్యవతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్వీ సుబ్బారెడ్డి, బి.మస్తాన్ వ్యవహరించారు.

పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- కమిషనర్ నారాయణరెడ్డి

పొదిలి: నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి కోరారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని కోరారు. తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. రోడ్ల వెంట ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఫ్లెక్సీలు, సైన్‌బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న చెన్నారెడ్డి

కంభం: మండలంలోని రావిపాడులో రుక్మిణీ సహిత వేణుగోపాలస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను కంభం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి మంగళవారం ప్రారంభించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబులరెడ్డి, సర్పంచులు శ్రీధర్ రెడ్డి, రసూల్, పెద్ద కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బాలసుబ్బులు, రఫీ, ఆనంద్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నాయకులు సాంబశివారెడ్డి, గురుమూర్తి, హుస్సేన్‌బాషా, చలువాది రమణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రాచర్ల: కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ కార్యదర్శి దుడ్డు థామస్ డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ భారతిబాయ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. లేబర్‌కోడ్స్ అమలు చేయవద్దని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇంటి నిర్మాణానికి రుణాలతో పాటు పిల్లల చదువులకు స్కాలర్‌షిప్ సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.పాపయ్య, ఎం.బసవయ్య, పరదేశి రాజశేఖర్ పాల్గొన్నారు.



డీటీ బారతిబాయ్‌కి వినతిపత్రాన్ని అందజేస్తున్న థామస్

ఆహ్లాదకర వాతావరణంలో విజ్ఞానాభివృద్ధి

రాచర్ల: విజ్ఞానాభివృద్ధి ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాచర్లలోని స్పందన స్కూల్లో ప్రకాశం బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ రాచర్ల మండల శాఖల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన, వినోదం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా, సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సహ పాఠ్యకార్యక్రమాల్లో రాణించాలని తెలియజేశారు. విద్యార్థులు గణితంపై భయం వీడాలని, గణితాన్ని ఎంతో సరదగా నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పి.స్వరూపరెడ్డి, జేవీవీ రాచర్ల ప్రధాన కార్యదర్శి పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి, స్పందన స్కూల్ అధినేత పేర్ల పరమేశ్వరరెడ్డి, జేవీవీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, డి.కాశిం, కె.బాబు, షేక్.రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

రేపటి నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు

మార్కాపురం: మండలంలోని బొడిచర్ల గ్రామంలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, స్వామివారి సేవా సంఘం సభ్యులు తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు హరేరామ.. హరేకృష్ణ.. ఏకాహ భజనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఆకుపూజ, అష్టోత్తర శతనామ పూజలు, ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటాయని పేర్కొన్నారు. 23న స్వామివారికి హనుమాన్ ఛాలీసా పారాయణం, సుప్రభాత సేవ, 24న స్వామివారి ఆలయంలో వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం, రాత్రికి ఆధ్యాత్మిక ఉపన్యాసం నిర్వహించనున్నట్లు వివరించారు. 27న సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగించుకోండి



చెస్ నేర్చుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగంపై నిపుణులు మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతిరోజూ గంట పాటు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని, శిబిరంలో వివిధ రకాల క్రీడలు, పుస్తకపఠనం, వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పిస్తున్నట్లు వివరించారు.

లేబర్ చట్టాల రద్దు కోరుతూ రాస్తారోకో



మార్కాపురం: రాస్తారోకో చేస్తున్న కార్మికులు

మార్కాపురం: కార్మికుల హక్కులను హరించే లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాలు వద్దే వద్దంటూ స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్లకు లబ్ధిచేకూరుస్తోందని విమర్శించారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం 4 చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. కనీస వేతన చట్టానికి వ్యతిరేకంగా, సమ్మెచేసే హక్కును హరించే విధంగా తయారు చేసిన కార్మిక చట్టాలను ర ద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వే, స్టీల్‌ప్లాంట్లను కార్పొరేట్లకు కట్టబెట్టి కార్మికులకు ఉపాధి లేకుండా చేసే చర్యలను కేంద్రం ప్రోత్సహించడం దుర్మార్గమని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సోమయ్య, రూబెన్, నాగరాజు, బాలశేషయ్య, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో కార్మికుల నిరసన

పొదిలి: కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పొదిలిలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్లను రద్దు చేయకుంటే కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గ సంఘటిత ప్రతిఘటనను ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. చిన్న బస్టాండ్ నుంచి పెద్ద బస్టాండ్ వరకు ప్రధాన వీధిలో ర్యాలీ సాగింది. సమస్యలు పరిష్కరించకుంటే జూలై 9న చేపట్టే సమ్మెలో కార్మికుల సత్తా చూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, టి.యేసు, డి.సుబ్బయ్య, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో..

కొనకనమిట్ల: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తహసీల్దార్ ఆవుల సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, పి.బాలనరసయ్య మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయడంతోపాటు కనీసం వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. .



కొనకనమిట్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



పొదిలిలో నినాదాలు చేస్తున్న కార్మికులు

రేపటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో దక్షిణాభిముఖ వీరాంజనేస్వామి ఆలయంలో ఈనెల 21, 22వ తేదీల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ వింగ్ అధికార ప్రతినిధి, ఆలయ శాశ్వత ధర్మకర్త బిక్కా రామాంజనేయరెడ్డి తెలిపారు. 21న 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 22న విశేష పూజలు, సువర్చలా సమేత ఆంజనేస్వామి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం, మధ్యాహ్నం అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. 22న ఆలయంలో పూజలకు మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని వేడుకలకు ఆహ్వానిస్తున్న రామాంజనేయరెడ్డి

హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయండి



మాట్లాడుతున్న హరిహరరావు తదితరులు

మార్కాపురం టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం మార్కాపురం పట్టణంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోపాలుని హరిహరరావు, గుంటక వనజాక్షి, గుంటక సుబ్బారెడ్డి, పీవీకృష్ణారావు, ఇమ్మడిశెట్టి వీరారావు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా హనుమాన్ శోభాయాత్రను ప్రజలు, దాతలు, హిందూ బంధువుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. తర్లుపాడురోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు వేలాది మంది భక్తులతో కలిసి కోర్టు సెంటర్, కంభం సెంటర్, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, నాయుడువీధి, మెయిన్ బజారు మీదుగా శోభాయాత్ర పాత బస్టాండ్‌కు చేరుతుందని, అనంతరం చెన్నకేశవ స్వామి గుడి వరకు కొనసాగుతుందని వివరించారు. శోభాయాత్రకు మార్కాపురం పట్టణంతో పాటు తర్లుపాడు, పెద్దారవీడు, మార్కాపురం రూరల్‌లోని వివిధ గ్రామాల నుంచి రామభక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భముగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో పాల్గొనే వారందరూ క్రమశిక్షణతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.లావణ్య, అపర్ణ, వాసు, శ్రీధర సాయి, రంగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ, పోలేరమ్మ జాతర



పోలేరమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేట గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలైన బంగారమ్మ తల్లి, పోలేరమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. రామాలయం వద్ద బొడ్డురాయికి పూజలు చేసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం రెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పోలేరమ్మతల్లి ఆలయం వద్ద గ్రామస్తులు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

రేషనలైజేషన్‌తో వీఆర్వోలపై పని భారం

పొదిలి రూరల్: ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఇచ్చిన జీవో నంబర్4తో పని భారం పెరుగుతుందని వీఆర్వోలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రెవెన్యూ సంఘం పిలుపు మేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వీఆర్వోలు మాట్లాడుతూ.. రేషనలైజేషన్, క్లస్టర్ విధానంలో లోపాలను గ్రహించి ఎన్నో పర్యాయాలు ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్న పట్టించుకోలేదన్నారు. ఆ జీఓతో తమ కేడర్‌కు, ప్రమోషన్ చానల్‌కు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పొదిలి మండలంలో 17 మంది వీఆర్వోలు ఉండగా రేషనలైజేషన్ వల్ల కేవలం 9 మందే కొనసాగుతున్నారని, దీని వల్ల పనిభారం పెరుగుతుందని వివరించారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్వోలు

యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

కంభం: మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న కందులాపురం గ్రామానికి చెందిన యూట్యూబర్ ప్రవీణ్ కుమార్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ కోరారు. మంగళవారం కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కులమతాలకు అతీతంగా కంభంలో ప్రజలు కలిసిమెలసి ఉంటున్నారని, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మేకల బాను, వినోద్, అరుణ్‌దీప్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

పవనసుతునికి ప్రత్యేక పూజలు



ద్రాక్ష పండ్ల అలంకారంలో స్వామివారు

మార్కాపురం: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కంభం రోడ్డులోని నాగులపుట్ట వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం స్వామివారిని ద్రాక్ష పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు త్రిభువనాచార్యులు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం విద్యుత్ ప్రభపై సినీయాక్టర్ శివారెడ్డితో సాంస్కృతిక కార్యక్రమం, 22న స్వామివారికి చందన అలంకారం, కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వాహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో మంగళవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో పురోహితులు డి.అరుణాచార్యులు ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ ఉభయ దాతలుగా చినారికట్లకు చెందిన వేణుగోపాల్, సుజాత, వెంకటరెడ్డి, అంజనీదేవి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం వైకుంఠ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.